పండగ సందడి



ముత్తుకూరు మండలంలో తాటిమట్టలు విక్రయిస్తూ..

పొదలకూరు: తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి సందర్భంగా పల్లెల్లో సందడి మొదలైంది. ఆదివారం భోగి పండగ. ఈ నేపథ్యంలో శనివారం మండల కేంద్రమైన పొదలకూరులో దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. దుస్తులు, నిత్యావసర వస్తువుల షాపులకు జనం పోటెత్తారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనాలు పట్టణానికి చేరుకోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. వ్యాపారాలు ఆశించిన స్థాయిలో ఉన్నట్లు సంబంధిత వ్యక్తులు తెలిపారు. గ్రామాల్లో వరినాట్లు పడడం వల్ల కూలీలు ఆనందంగా ఉన్నారు. ఈ ఏడాది భోగి పండగ ఆదివారం రావడంతో మాంసం దుకాణాల వ్యాపారులు విక్రయాలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. గతేడాది శనివారం పండగ రావడంతో వ్యాపారం గణనీయంగా తగ్గింది. భోగి మంటలను వేసేందుకు తాటిమట్టలను సైకిళ్లు, మోటార్‌బైక్‌లు, ఆటోలపై ఇళ్లకు తీసుకెళ్లారు. యువత అర్ధరాత్రి నుంచే మంటలు వేసి పెద్ద పండగకు స్వాగతం పలికారు. అరిసెలు ప్రత్యేక వంటకం కావడంతో మహిళలు ఇళ్ల వద్ద ప్రత్యేకంగా పొయ్యిలు ఏర్పాటు చేసి తయారీ పనిలో నిమగ్నమయ్యారు.

• ముత్తుకూరు: మండలంలోని పల్లెల్లో భోగి మంటలు వేసేందుకు సరంజామా సిద్ధం చేసుకున్నారు. పలుచోట్ల ప్రధాన కూడళ్లలో శనివారం రాత్రి నుంచే మంటలు వేశారు. కాగా పల్లెల నుంచి నెల్లూరుకు, పరిసర ప్రాంతాలకు వివిధ వాహనాల్లో పెద్ద ఎత్తున తాటాకుల రవాణా జరిగింది. ప్రధాన కూడళ్లలో తాటిమట్టలు కుప్పలు పోసి అమ్మకాలకు సాగించారు. మంటలు వేసేందుకు ప్రతి ఇంటి ముందు తాటాకులు నిల్వ చేసుకున్నారు. మరోవైపు దుస్తుల దుకాణాలు, నిత్యావరసర వస్తువుల అంగళ్లు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి.



పొదలకూరు : ఆటోలో తాటిమట్టలను తరలిస్తున్న దృశ్యం

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

• సీఐ రాంబాబు

పొదలకూరు: సంక్రాంతి సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహించినా, నాటు సారా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాంబాబు హెచ్చరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం ఎస్సై బి.మస్తానయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పండగను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాల్సిందిగా సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. పండగల సందర్భంగా గ్రామాల్లో పోలీస్ నిఘా ఉంటుందని కోడిపందేలు జరుగుతున్నట్లు సమాచారం వస్తే వెంటనే దాడులు నిర్వహించి సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుంటామన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు ముందుగా సమాచారం అందజేస్తే దొంగతనాలు జరగకుండా గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై 94407 00006, 94407 00007 ఫోన్ నంబర్లకు సమాచారం అందజేయాలని సూచించారు.



మాట్లాడుతున్న సీఐ రాంబాబు, ఎస్సై మస్తానయ్య

• కొడవలూరు: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.వీరప్రతాప్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జూదం ఆడటం వల్ల ఆర్థికంగా చితికిపోవడంతోపాటు వివాదాలకు దారితీసే ప్రమాదం ఉందన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి : ఎస్సై

మనుబోలు: యువత క్రీడల్లోనూ రాణించాలని ఎస్సై అజయ్‌కుమార్ అన్నారు. బొమ్మిరెడ్డి వెంకురెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులు, యువత క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుపైనే కాకుండా క్రీడలపై కూడా దృష్టి సారించాలన్నారు. మాజీ సర్పంచ్ బొమ్మిరెడ్డి వెంకురెడ్డి, వనజాక్షమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి మనుమడు పార్థేశ్వరరెడ్డి ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, రెండో స్థానంలో వచ్చిన జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతులు అందజేస్తారు. మొత్తం 30 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



బ్యాటింగ్ చేస్తున్న ఎస్సై అజయ్‌కుమార్

నిత్యావసర సామగ్రి వితరణ



నెల్లూరు(బృందావనం): అందరూ సంతోషంగా ఉండటమే పండగ అని నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. స్టోన్‌హౌస్‌పేటలోని ఎస్వీఎస్ కల్యాణ మండపంలో మన సంక్రాంతి.. మన పెద్దల పండగ కార్యక్రమాన్ని ఎస్వీఎస్సార్ నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం, దాతల సహకారంతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలైన 600 మంది ఆర్యవైశ్య కుటుంబాలకు రూ.రెండు వేల విలువజేసే నిత్యావసర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కోట సూర్యనారాయణ, అర్బన్ ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, కార్యదర్శి బైసాని జ్యోతిప్రసాద్, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరామ్ సురేష్ పాల్గొన్నారు.

చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా అశోక్‌కుమార్ బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఎస్సైలు సైదులు, సుధీర్, సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట, అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని జిల్లాకు చెందిన పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం అసోసియేషన్ క్యాలెండర్‌ను వేమిరెడ్డి ఆవిష్కరించారు. ఫౌండర్ ప్రెసిడెంట్ గడ్డం హనోక్, జనరల్ సెక్రటరీ రమేష్, ట్రెజరర్ కిశోర్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ రాజు, సదాశివరావు, జాషువా, శ్యామ్‌ప్రసాద్, సుధీర్‌బాబు, పీటర్ ఆత్మా మీనన్, సునీల్ గావస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సంక్రాంతిని పురస్కరించుకుని 47వ డివిజన్లోని గుప్తా పార్కు సెంటర్‌లో గల సిటీ స్కూల్ వద్ద ముగ్గుల పోటీలను కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ ఆచారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేసిన అనంతరం నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం కుక్కలగుంటలోని మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద నెల్లూరు జిల్లా వన్నెకుల క్షత్రియ, అగ్నికుల క్షత్రియ సంఘ క్యాలెండర్లను ఆవిష్కరించారు.

క్లుప్తంగా

చేతి వృత్తుల ఐక్యవేదిక సమావేశం

పొదలకూరు: జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ సమావేశం శనివారం పొదలకూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ అభ్యర్థిగా ఎన్నికైన సీహెచ్ చినసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున ఇటీవల విజయవాడలో నిర్వహించిన సమావేశంలో 35 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గూడూరు పట్టణానికి చెందిన మున్వర్‌బాషా పని నిమిత్తం బైక్‌పై కృష్ణపట్నం పోర్టుకు వెళ్లాడు. తిరిగి గూడూరుకు వెళ్తూ సర్వేపల్లి సమీపంలో ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పింది. మున్వర్ కింద పడి గాయపడగా ఆయన్ను స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం జరిగింది. వేదపండితులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. ప్రత్యేక పూజల్లో దేవస్థాన కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

• దేవస్థానానికి నెల్లూరుకు చెందిన దిలీప్ కుమార్ తన తండ్రి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు.

గడప గడపకూ అయోధ్య అక్షతలు



అక్షతలు అందజేస్తున్న రమేష్

మనుబోలు: అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరాముని అక్షతలను సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం పంపిణీ చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ ఆలూరు రాము వాటిని అందజేయగా గోవిందరాజపురంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా కార్యదర్శి గుంజి రమేష్ రామాలయంలో పూజ చేసి గ్రామస్తులకు పంపిణీ చేశారు. అక్షితలతోపాటు గుడి ఫొటోతో కూడిన కరపత్రాలను కూడా పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు బ్రహ్మయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నెల్లూరు(దర్గామిట్ట): అల్లూరు మండలం వెస్ట్ గోగులపల్లికి చెందిన దాసరి సాయికుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.80 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాలుడి తండ్రి గోపాల్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం అందజేశారు. తన సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి ఆధ్వర్యంలో తన నివాసంలో చెక్కును ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో పుచ్చలపల్లి నిరంజన్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(పొగతోట): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల జేఏసీ నేతలు పాండు బెల్లంకొండ, బాలరాజు కోరారు. నగరంలోని సచివాలయాల అసోసియేషన్ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయ జేఏసీ ఆధ్వర్యంలో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సెక్రటరీలు చైతన్య, మల్లి, కోటి, దినేష్, కిరణ్, కామాక్షి, ఝాన్సీ, దీపిక, కిషన్, సంధ్య పాల్గొన్నారు.

కార్మికుల శ్రమను గుర్తిద్దాం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న దయాకర్‌రావు

నెల్లూరు సిటీ: పారిశుద్ధ్య కార్మికుల శ్రమను గుర్తించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సింహపురి హాస్పిటల్ డాక్టర్ దయాకర్‌రావు పేర్కొన్నారు. నగరంలోని హాస్పిటల్, ఇంటి వద్ద పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు ఆర్థిక సాయాన్ని శనివారం ఆయన అందజేశారు.

డైరీ ఆవిష్కరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ డైరీని నగరంలోని ఓ కల్యాణ మండపంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అల్తాఫ్, నేతలు బాషా, యూసఫ్, అలీబేగ్, అబ్బాస్ హుస్సేన్, పాషావలీ, ఖాజాపీర్, రఫీ అహ్మద్, సలీమ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా భోగి తోట ఉత్సవం



నెల్లూరు(బృందావనం): సంక్రాంతిని పురస్కరించుకుని నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో ఆండాళ్ అమ్మవారి భోగి తోట ఉత్సవాన్ని వేడుకగా శనివారం నిర్వహించారు. నవాబుపేటలోని బుజ్జమ్మతోట వరకు ఉత్సవం సాగింది. అనంతరం స్వామికి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి పరామర్శ

నెల్లూరు (పొగతోట): రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడి కోలుకుంటున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఏపీజీఈఎఫ్ నేతలు శనివారం పరామర్శించారు. ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, జిల్లా జనరల్ సెక్రటరీ దేవిరెడ్డి రమణారెడ్డి, సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరీష్‌రెడ్డి, జిల్లా ట్రెజరర్ బాలు, వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందిన ఘటనపై సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొండాయపాళెం గేట్ సమీపంలో భిక్షాటన చేసుకుని దుకాణాల వద్ద రాత్రి వేళ సాయి శ్రీను (60) నిద్రించేవారు. ఈ క్రమంలో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కొండాయపాళెం గేట్‌కు వెళ్లే రోడ్డు పక్కన పడుకుని ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు స్థానికులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మరణించారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని సౌత్ ట్రాఫిక్ పోలీసులు కోరారు.

గ్రామాల్లో వేగంగా అభివృద్ధి పనులు



పట్టా అందజేస్తున్న మంత్రి కాకాణి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: 'గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తున్నాం.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామ సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రం, సీసీ రోడ్లు, డ్రెయిన్లు తదితర అభివృద్ధి పనులను శనివారం మంత్రి కాకాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అవినీతికి తావు లేదన్నారు. తోటపల్లి సచివాలయం పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.4.80 కోట్లు వెచ్చించామన్నారు. వివిధ సంక్షేమ పథకాల కింద మరో రూ.23.80 కోట్లను ఖర్చు చేయడం జరిగిందన్నారు. కరోనా కష్టకాలంలో, తుపాన్ల వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అన్నివిధాలా అండగా నిలిచామన్నారు. అనంతరం అర్హులైన రైతులకు మంత్రి కాకాణి అసైన్‌మెంట్ పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోటపల్లిగూడూరు, పేడూరు సొసైటీ అధ్యక్షులు కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ ఈదూరు రామాచార్యులు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, స్థానిక నాయకులు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, టంగుటూరు పద్మనాభరెడ్డి, మన్నెం చిరంజీవులగౌడ్, ఒబ్బారెడ్డి సురేష్‌రెడ్డి, వీరరాఘవులు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిమానంతోనే పదవులు

పొదలకూరు: ప్రజాభిమానంతోనే తన తాత, నాన్నకు పదవులు లభించాయని, తోడేరు ప్రజల ప్రేమానురాగాలను ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితారెడ్డి తెలిపారు. సంక్రాంతి సందర్భంగా మండలంలోని తోడేరు పంచాయతీ తోడేరు, రత్నగిరి, తోడేరు దళితవాడ, శాంతినగర్, వీవర్స్ కాలనీల్లో శనివారం పూజిత పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తోడేరు పంచాయతీ ప్రజలు విలువలు, విశ్వసనీయతకు మారుపేరన్నారు. అందువల్లే తన తండ్రి రెండు పర్యాయాలు సర్వేపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించగలిగినట్లు తెలిపారు. తాము ఏ స్థాయిలో ఉన్నా గ్రామాన్ని మర్చిపోమన్నారు. సంక్రాంతి పండగను పంచాయతీ ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అలుపూరు పెంచలమ్మ, ఎంపీటీసీ స్వర్ణ సుగుణ, పొదలకూరు ఎంపీటీసీ జి.లక్ష్మీ కల్యాణి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఏనుగు శశిధర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఎం.శ్రీనివాసులు, ఎజ్డానీ, అంజాద్, లోకేశ్ పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న పూజితారెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన

మనుబోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ మారంరెడ్డి ప్రదీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం 8వ తరగతి విద్యార్థులు 35 మందికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను మార్చేందుకు నాడు – నేడును ప్రవేశపెట్టారన్నారు. బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. అంతే కాకుండా విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాం, బ్యాగ్‌లు, బూట్లు, పుస్తకాలు అందజేశారన్నారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. అమ్మ ఒడి, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాల ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. ఎంఈఓ శేషాద్రివాసు మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు రామచంద్రారెడ్డి, గుమ్మా నరేష్, ఇండ్ల గోపి, షేక్ మస్తాన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ట్యాబ్ అందజేస్తున్న ప్రదీప్‌రెడ్డి

జనహిత - వాత్సల్యకు విరాళం

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని జనహిత – వాత్సల్య కేంద్ర నిర్వహణకు రూ.1.08 లక్షలను ఫిజీషియన్ కోటేశ్వరరావు, రెడ్‌క్రాస్ సొసైటీ కేన్సర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి శనివారం అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆశ్రమ నిర్వాహక కార్యదర్శి సాంబశివరావుకు ఇచ్చారు.ఈ కేంద్రానికి నిత్యావసర సామగ్రిని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిమండలం ఆంజనేయవర్మ అందజేశారు. తన కుమారుడు రాజానితిన్ జన్మదినాన్ని పురస్కరించుకుని వీటిని వితరణ చేశారు. ఏపీజీఈఎఫ్ చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, మానవ సేవే మాధవ సేవ టీమ్ సభ్యులు, ఎన్జీఓ నేతలు మన్నేపల్లి పెంచలరావు, బండారు వెంకటేశ్వర్లు, బాలు, మల్లికార్జున, పరిమళ, శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జున, గిరి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వెంకటేశ్వరుడి కల్యాణం

నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని బాలాజీ నగర్‌లోని సీతారామ స్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా శనివారం నిర్వహించారు. ఉభయకర్తలుగా దేశ్‌పాల్‌సింగ్, దేవకీదేవి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు గుప్తా, రత్నం, కోశాధికారి మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అర్హులకు సంక్షేమ పథకాలు

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు వర్తింపజేయాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై పొదలకూరు రోడ్డు, చిల్డ్రన్స్ పార్కు రోడ్డులోని సాయిబాబా మందిరం వద్ద ప్రచార వాహనం, శిబిరాల ద్వారా శనివారం అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి గిఫ్ట్ బాక్సులను అందజేశారు. సంకల్ప యాత్ర కన్వీనర్లు రాధాకృష్ణగౌడ్, రవిశంకర్, అశోక్, రాజేశ్వరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత శరత్‌చంద్ర, సెక్రటరీ హేమావతి, ఏఈ చాణక్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

కొడవలూరు: విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై తరగతులు నిర్వహించనున్నట్లు మండలంలోని గండవరం జెడ్పీ హైస్కూల్ హిందీ పండిట్ జి.నాగభూషణం తెలిపారు. గుంటూరు జిల్లాలో స్టెప్ సంస్థ నిర్వాహకులు, సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు నేతృత్వంలో 10, 11, 12 తేదీల్లో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనికి నాగభూషణంకు ఆహ్వానం అందగా ఆయన వెళ్లారు. శనివారం మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న విషయాలను విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు, విద్యావంతులకు తెలియజేసి వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సంక్రాంతిని సుఖసంతోషాలతో జరుపుకోవాలి

నెల్లూరు(క్రైమ్): సంక్రాంతి పండగను ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.